# ON IDOLATRY (1847)

## విగ్రహనిర్మాణము

### మొదటి పాఠము

ఇదేమి వెఱ్ఱి, యేమి వెఱ్ఱి - యీనరాళికయ్యయో॥

1. నరుండు గొడ్డలిన్ కరంబునన్ ధరించి బోయి యా।
యరణ్యమందు చెట్టుగొట్టి, యట్టి మాను నింటికిన్।
బిరాల నీడ్చి తెచ్చి నూలువేసి కొల్చి దానికిన్।
స్వరూపముంచి వేల్పుజేయ వడ్లవాని బిల్చునో ॥ ఇదేమి వెఱ్ఱి॥

2. మదించి వడ్లవాడు కూలి మాట ముందు తేటగా।
విధింతువేని మానుజెక్కి వేల్పుజేతునన్న చో।
పదిర్వదంచు వీడు వాడు పల్కి గుద్దులాడుచున్।
తుదన్ కుదిర్చి సంచకర్వుతోటి యప్పగించునో ॥ఇదేమి వెఱ్ఱి॥

3. భుజాబలంబుతోడ బాడ్తెబూని వడ్లవాడు దా।
నిజూచి పుచ్చులేదటంచు నిశ్చయించి మాను భూ।
ప్రజల్ భళీ యనంగ దాని పట్టి ముక్క చెక్కి వే।
ల్పుజేతునంచు బొమ్మజేయు బుద్ధిలేనివారికై ॥ఇదేమి వెఱ్ఱి॥

4. తుదల్ మొదళ్ళుగొట్టి వానితోటి యన్న శాకముల్।
ముదంబుతోడ వంటజేసి ముందుగా భుజించి వె।
న్క దాని చెక్కపేళ్ళు శీతకాలమందు కుంపటిన్।
కుదిర్చి యగ్నికాగె వీటిగూర్చు బొమ్మగాదకో ॥ ఇదేమి వెఱ్ఱి॥

5. అలాటి కొయ్యబొమ్మ కక్షులాననంబు జక్కగా।
నలంకరించి రంగువేయుమయ్య ముచ్చివాడ నీ।
వెలాగు జేతువో సుమీ యదేల నీకు నేర్ప నీ।
తలంపు మెచ్చునట్టి కూలి దాని కిత్తుదందురో ॥ఇదేమి వెట్టి॥

6. జగంబులోన దేనితోటి సాటిసేయరాదు గు।
డ్లగూబ మోమువంటి మోము డంబమింతియే మరే।
మిగానరాదు వేపమొద్దు మెచ్చిమెచ్చి దీనికిన్।
జగత్తునాధుడంచు జెప్ప జాల సిగ్గుగాదకో ॥ఇదేమి వెట్టి॥

7. రథోత్సవంబువచ్చె రండురండటంచు యాజకుల్।
ప్రధానులైనవారు వెర్రిబట్టి మూగిబొమ్మవే।
రథంబుమీది కీడ్చి దాని త్రాళ్లతోటి గట్టుచున్।
వృధాశ్రమన్ భ్రమింతు రిట్లు విత్తగర్వకాంక్షచే ॥ఇదేమి వెట్టి॥

మరిన్ని యిటువంటి బొమ్మతట్టు చూచి వివేక బుద్ధిగల కొందరు జనులు వారిలో వారు యీలాగు మాట్లాడుకొందురు.

## రెండవ పాఠము

చూడరా! యిదిచూడరా! భ్రమవీడురా! యికవీడరా!

1. అల్లదేమిటి చూడరా యొక-నల్లమొగ మందున్నదీ॥
కల్లగాదు నిజంబురా యది-కర్రముక్కైయున్నదీ ॥చూడురా॥

2. ముక్కు చెక్కుట వెట్టిరా-యది-మూర్ఖనంగాజాలదూ
తొక్కవొలిచిన మాను దానికి-మ్రొక్కితే ఫల మేమిటి? ॥చూడురా॥

3. కన్నులున్నవిగాని లోకుల-గాంచు రీతిక లేదురా।
దున్న మేలుర దానికన్నను।త్రోవగని యదిపోవురా ॥చూడురా॥

4. నోరుచెక్కెను దాని నికయే-నూరుగొట్టిన పల్కదూ।
వేరుదొలగిన మొద్దు దానికి-పేరు ఎంతో పెద్దరా ॥ చూడరా॥

5. చెవులు లేవుర దానిలో నొక-చిన్నెయైనను గానమూ
శవముపోలిక నున్నదచ్చట-సార మేమియు లేదురా ॥చూడురా॥

6. జెబ్బలున్నవి దానికిక నర-చేతు లేమైపోయెనో।
అబ్బురపు పనిబొమ్మరా శిశు-వాడుకోను తగదిదీ ॥చూడురా॥

7. బాపనయ్యలు గూడిరీ జీ-వప్రతిష్ఠలు చేసిరీ
వేపకర్ర నిబద్ధిరా వొక-వ్రేలెడైనా యెదుగదూ ॥చూడరా॥

8. వింతమంత్రము లుచ్చరింతురు-వెట్టిప్రాణము రాదయో
యెంతజేసిరొ యంతకంటే యెక్కువెప్పుడు కాదురా ॥చూడురా॥

9. కొయ్యకిదు ప్రాణంబు-తాతన-యయ్య చచ్చిన కాల్చెనూ
చెయ్యడేమిర యిట్టి యోచన-సిగ్గుమాలి యింకెవ్వడూ ॥చూడురా॥

వోయి యిది చదివేవాడా నీవు యెవడవైనప్పటికి సరే - నీకు వొక వేళ వివేకము కలుగ వచ్చును. అప్పుడు నీవు తలంచుకొందువు యేమంటే బొమ్మయున్ను దాని పూజలున్ను వ్యర్థమే - అయితే నిజమైన దేవుడు యెవడు? యెక్కడ వున్నాడు? ఆయనకు యే లక్షణములు వున్నవి? అని నీవు తెలుసుకొనేటందుకు అడిగే వాడవైతే యీ దిగువను వ్రాసియున్న అయిదు సీసపద్యములలో నీవు బుద్ధి పూర్వకముగా చదివితే తెలుసుకోగలవు.

## పంచరత్నములు

1. ఎవ్వడు తనజేన నిమిడించి కొలుచు నీ
యాకాశ మండలం బద్భుతముగ,
నెవ్వడీ పుడమి మన్నెల్లను తన కుంచ
•మునకు లోబడజేయు ఘనబలమున,

యెవ్వడీ మహిత మహీధరంబుల బట్టి
తన తరాజున నుంచి యొనర దూcచు,
నెవ్వడీ జలధులం దిముడు నీరములన్ని
తన చేతి పుడిసెలో నునిచి కొలుచు,

తే॥గీ॥ వసుధగల సర్వజీవాళి నిసుక కన్న
సన్నముగ జూచి త్రాసులో నరగ నునుచు,
నెవడో యాతడె నా తండ్రి యిష్టుడైన,
ఘనుడగు యెహూవ దిక్కు నా కనుదినంబు.

2. ఎవ్వని చేతిలో నీ విశ్వమంతయు
నాటల పూబంతి యట్టులుండు,
నెవ్వని కాంతియం దీసూర్యచంద్రులు
మెరుగుడు పురుగుల ట్లెరుగబడుదు,
రెవ్వని యొడిగట్ట నీ తారలన్నియు
మల్లెమొగ్గలరీతి గిల్లబడును,
యెవ్వని కనుదృష్టి కీ భూమి గోళంబు
నరసావగింజతో సాటిపడును

తే॥గీ॥ యెవని మిాగాళ్ళ బంటి రావీయగాధ,
వార్ధి నీరములటువంటి వర బలాఢ్యు,
డెవడో యాతడెనా తండ్రి యిష్టుడైన,
ఘనుడగు యెహూవ దిక్కు నా కనుదినంబు

3. పరమండలము వసుంధర మండలము బట్టి
బంతులట్లాడించు ప్రబలుడెవడు,
పగటెండ రేయెండ పాన్పులట్లుగ చుట్ట
బెట్టి వేరొకచోట బెట్టునెవడు,

సర్వ జీవాధార సంచార పవనంబు
  లొక, ముష్టిలో బట్టు నొడయ డెవడు,
హిమ, తపో వర్షకాలముల మూలలనుంచి
  యెత్తి యుద్యోగంబు లిచ్చునెవడు;

తే॥గీ॥ తనకు దానె సమాన సౌందర్య సర్వ,
శక్తి విజ్ఞాన, సత్కృపా, శాంతమూర్తి
యెవడొ యాతడె నా తండ్రి యిష్టుడైన
ఘనుడగు యెహూవ దిక్కు నా కనుదినంబు.

4. పరమదూతల మోక్షపురమను దెవ్వనికంట
  పరిశుద్ధముగ చూడ గొరత దోఁచు,
సత్య ప్రియాధిక సంతోషముల మీద
  నెవని సింహాసనం బెలమినుండు,
సకల జీవుల భక్ష్య సామగ్రులెల్ల నె
  వ్వని చేతి దానంబులనుదినంబు,
సకలార్థ శబ్ద వాచకములన్నియు గూడి
  యెవని పేర్కొనియాడ నెరుగలేవు,

తే॥గీ॥ ఎవ్వరే కాలమున కంటి కింపుతోడ,
జూడగోరిన తనరూపు జూపకుండు,
నెవడో, యాతడె నా తండ్రి యిష్టుడైన,
ఘనుడగు యెహోవ దిక్కునా కనుదినంబు

5. అఖల లోకముల వృత్తాంత మాద్యంతంబు
  ఎవ్వని పటమునం దిమిడి యుండు,
సకలాంతరాత్మల సాక్షియై యెవడు కా
  రణ కార్యభావనల్ గణనసేయు,

జీవ నిర్జీవన సైన్యావళిలో చిన్న
పురువైన తృణమైన మరువ డెవడు,
తగ భవిష్యద్భూత తత్కాలముల నేలు
చొక రీతిగల నీతి నుండు నెవడు,

తే॥గీ॥ తండ్రి తనయుండు విమలాత్మ తానె యగుచు,
నాణెముగ దీన భక్త బృందముల బ్రోచు
నెవడొ యాతడె నా తండ్రి యిష్ఠుడైన,
ఘనుడగు యెహూవ దిక్కునా కనుదినంబు

చదివేవాడా యీ మీద వ్రాయబడి యున్న అయిదు పద్య ములున్ను నీవు బాగా చదివి వాటి తాత్పర్యము బోధించుకొంటే నిజ మైన దేవుడు యెటువంటివాడో అది నీవు తెలుసుకోగలవు - అయితే దీని తెలుసుకొనుట మాత్రము చాలదు - మరి యేమంటే ఆ దేవుడు నీ పాప పరిహారము కొరకై పంపిన యేసు క్రీస్తనే రక్షకుని నీవు నమ్మవలెను. నమ్మినట్టయితే అవశ్యము రక్షింపబడుదువు.

## కీర్తన

మా యేసు క్రీస్తుని మఱుగు గల్గెనురా!
నా యాత్మరక్షణ నగము నెక్కెనురా!

1. ముందు నాలో పాపములు జూడబడెరా! డెంద
ము తానన్నిటిని యొప్పుకొనెరా! అందుకై బహుదుః
ఖమాత్మజెం దెనురా! సందేహములు వీడు జాడగన్గొనెరా!
॥మాయేసు॥

2. సువిశేష బోధ నా చెవులాలించెనురా! యవివే
క శాస్త్రోక్తులంటూ వీడెనురా! నవనక్రైస్తవగోష్ఠి భువి
నాకబ్బెనురా! వివిధ దేవుల జాడ విషమట్లయ్యెనురా! ॥మా యేసు॥

3. రాగద్వేషముల సంభ్రమమెల్ల చెడెరా! మూగి
బొమ్మలు పాదముల త్రొక్కబడెరా! యోగమార్గ
ములన్ని వీగి గన్పడెరా! సాగుపాపపు బుద్ధి చతికిల్ల బడెరా!
॥మా యేసు॥

4. బాధ గురువుల మోముల్ బహు లజ్జపడెరా!
గాధమంత్రములన్నీ కడగండ్లై చెడెరా! శోధించినా
యాత్మశుద్ధి గోరెనురా! సాధించి ప్రభుక్రీస్తు శరణు జొచ్చెనురా!
॥మా యేసు॥

5. మతిలోని లోతు మర్మము గానబడెరా! మితి
లేని ఖల పాపమే నిండుకొనెరా! హితముగా తన
జీవమిచ్చె క్రీస్తుదురా! మృతి రక్తమున పాపతతి బోగొట్టెనురా!
॥మా యేసు॥

6. కులము గోత్రమనెడి కుటిలంబు దెగెరా! బలవ
త్పిశాచ శృంఖళము వీడెనురా! శిలువ మోసినవాని
చిరసౌఖ్యోన్నతిరా – నెళవుగా నాలోన నిలిచియున్న దిరా!
॥మా యేసు॥

7. తన పోల్కె నౌరుల గన్గొన ప్రేమ యయెరామనసు దేవునికి యర్పణ
సేయబడెరా! కనికరమును శాంతి గొనియె నెమ్మదిరా! మనసు
మార్పుడి మోక్ష మహిమగన్గొనెరా! ॥మా యేసు ॥

(పురుషోత్తము చౌధరి కటకపురిలో బాప్తిసం గైకొన్న పిదప వ్రాసిన
తెలుగులోనే ప్రథమ క్రైస్తవ కీర్తన)

# ప్రభువైన యేసుక్రీస్తువల్లను రక్షణ పొందండి

**దేవుడు తన్ను గూర్చి తెలిపిన దేమంటే :-**

జగత్తునున్ను అందులో వుండే సమస్తమునున్ను నిర్మించిన దేవుడు తానే ఆకాశ లోకమునకున్ను భూలోకమునకున్ను ప్రభువై యుండినందు వల్ల చేతి పనులైన దేవాలయములలో నివసించడు. మరిన్ని ఆయన అందరికిన్ని జీవమునున్ను వూపిరినిన్ని సమస్తమునున్ను దయ చేసే వాడైయున్నాడు. గనుక తనకేదైనా కావలసినట్టు మనుష్యుల చేతులవల్ల సేవించబడడు. ఇది గాక ఆయన వొక రక్తము వల్లనే మనుష్యులలో సకల ప్రజలను సృష్టించి నిర్ణయించ బడిన కాలములనున్ను వారి యొక్క నివాస స్థలముల యొక్క పొలిమేరలనున్ను ఏర్పరిచి వారు వొక వేళ ప్రభువును తడువులాడి కనుగొందురేమో అని ఆయనను వెతికే కొరకు యావద్భూమి మీద కావురముండ చేసి యున్నాడు. ఆయనప్పటికిన్ని ఆయన మనలో యెవనికైనా దూరమైన వాడు కాదు యెందుకంటే మనము ఆయనవల్ల బ్రతుకుతున్నాము చలిస్తున్నాము, ఉంటున్నాము. అటువలె - యెందుకంటే మనము అతని వంశస్థులమై యున్నామని - మీ కవీశ్వరులలో కొందరు చెప్పి యున్నారు. కాబట్టి మనము దేవుని వంశస్థులమై యుండి దైవము మనుష్యుల చమత్కారము వల్లనున్ను కల్పనల వల్లనున్ను చెక్కబడిన బంగారముతో నైనా వెండితోనైనా రాతితోనైనా సమానముగా వున్నాడని తలంచకూడదు. ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూడనట్టుగా వుండెను అయితే యిప్పుడు అంతటా పశ్చాత్తాపపడవలెనని సమస్త మనుష్యులకున్ను ఆజ్ఞాపిస్తున్నాడు. యెందుకంటే తాను నియమించిన మనుష్యుని వల్ల న్యాయము చొప్పున భూలోకమునకు తీర్పు పొందుటకు దినము నిర్ణయించి యున్నాడు. అందుకు చనిపోయిన వారిలోనుంచి ఆయనను లేపినందువల్ల అందరికిన్ని నమ్మికెనిచ్చి యున్నాడనెను.

పాపముయొక్క జీతము మరణము. అయితే దేవుని కృపావరము మన ప్రభువైన యేసు క్రీస్తు ద్వారా నిత్య జీవమై యున్నది.

దేవుడు లోకమును ప్రేమించుట యేలాగంటే – ఆయన యందు విశ్వాసముంచే ప్రతివాడున్ను నశించక నిత్యజీవము పొందే కొరకు తన జనితైక కుమారుని యిచ్చెను.